క్లుప్తంగా

నేడు రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం రాత్రి నుంచి బోనాల పండుగ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆలయ చైర్మన్ కూనూరు అశోక్, గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సింహులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అడవి నుంచి పుట్టమన్ను తెచ్చి అలంకరించారు. సోమవారం రాత్రి నుంచి కొలువు ప్రారంభం అవుతుంది. ఇందులో భాగంగానే సప్పిడి రాము ఇంటి నుంచి ఏడంత్రాల బోనాలు, కూనూరు అశోక్ ఇంటి నుంచి ఘటం కుండా(పోతరాజు) తీసుకొని ఆలయానికి చేరుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తాళ్లపెల్లి మోహన్ ఇంటి నుంచి పావనం (అమ్మవారి) ప్రతిమతో బయలుదేరి రాత్రంతా కూడా అక్కడే జాగారాలు చేసి రేణుక ఎల్లమ్మ కథలను వివరిస్తున్నారు. మంగళవారం గ్రామంలోని మహిళలు రేణుక ఎల్లమ్మకు బోనాలను తీసుకురావాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భారీ వర్షానికి నిలిచిన విద్యుత్ సరఫరా

గోవిందరావుపేట: మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్పటికే పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో చేరుకున్న ఎన్నికల సిబ్బందికి మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షంతో సిబ్బంది చాలా అవస్థలు పడ్డారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి, కరెంట్ పోవడంతో మండలంలోని పలు గ్రామాల్లోకి అప్పటికే చేరుకున్న ఎన్నికల సిబ్బంది నానా తంటాలు పడ్డారు. 8:10 కి మళ్లీ కరెంట్ రావడంతో ఎన్నికల సిబ్బంది, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

జెడ్పీటీసీ కుటుంబానికి మంత్రి పరామర్శ



గోవిందరావుపేట: స్థానిక జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు తల్లి టాన్యా రాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో రాష్ట్ర మంత్రి సీతక్క (ధనసరి అనసూయ) ఆదివారం హరిబాబు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా టాన్యారాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ టాన్యారాణి మరణవార్త తెలిసిన రోజు ఎన్నికల ప్రచారంలో ఉన్నందున రాలేక పోయానన్నారు. హరిబాబు కుటుంబ సభ్యులు నాకు ఎంతో సన్నిహితంగా ఉంటారన్నారు. ఆమె వెంట ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, జెట్టి సోమయ్య, జంపాల చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, నాగేందర్‌రావు, నాగమణి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

పరామర్శ



ములుగు రూరల్ : జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా సంయుక్త కార్యదర్శి కూరాకుల బాలకృష్ణ తల్లి సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య పరామర్శించారు. ఆదివారం బండారుపల్లిలో మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు, ఉపాధ్యక్షులు బొచ్చు రాజేందర్, వేల్పుల కృష్ణ, కొడిపాక రవి, కత్తుల రమేష్, సంజీవ, గంగయ్య, మధుకర్, నాగయ్య, తదితరులు ఉన్నారు.

మహాముత్తారం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కీర్తిబాయి కుటుంబ సభ్యులను ఆదివారం శ్రీపాద ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దుద్దిళ్ల శ్రీనుబాబు పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



వాజేడు: వాజేడుకు చేరిన పోలింగ్ సిబ్బంది



వెంకటాపురంలో..



ఏటూరునాగారం : ఓటర్లకు నీడను కల్పించేందుకు ఏర్పాటు చేసిన టెంట్లు

నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నక్సల్స్ ప్రాంతాల్లో పగడ్బందీ ఏర్పాట్లు
- పోలింగ్ సామగ్రితో బూత్‌లకు చేరుకున్న సిబ్బంది



ఏటూరునాగారం: ఎస్కార్ట్‌తో వస్తున్న పోలింగ్ సిబ్బంది, ఈవీఎంలు

ఏటూరునాగారం: ఏజెన్సీలోని ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో పార్లమెంట్ ఎన్నికల కోసం ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితో పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. ఏటూరునాగారం మండల వ్యాప్తంగా 28 పోలింగ్ కేంద్రాలు , కన్నాయిగూడెంలో 14 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఎన్నికల అధికారులు ఎంపీడీవో కుమార్, తహసీల్దార్ జగదీష్ ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు రమాదేవి, లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేశారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయాలు, విద్యుత్‌తో పాటు మిగిలిన అన్ని సౌకర్యాలను అధికారులు కల్పించారు. ములుగు జిల్లా కేంద్రం నుంచి ఆదివారం పోలింగ్ బూత్‌ల వారీగా కేటాయించిన పోలింగ్ అధికారులు ఈవీఎంలు, సామాగ్రి, వీవీ ప్యాడ్‌లను చేతపట్టుకొని వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లకు పోలీసుల ఎస్కార్ట్ వాహనంతో ప్రైవేటు బస్సుల్లో సాయంత్రం 4.30ల వరకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 7 గంటలకు నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగేందుకు సామగ్రిని సిద్ధం చేసుకున్నారు. అంతేకాకుండా ఉదయం 6 గంటలకు మాక్‌పోలింగ్ నిర్వహించి ఈవీఎంలను పరిశీలిస్తారు. ఏదైనా సాంకేతిక సమస్యలుంటే వెంటనే వాటి స్థానంలో కొత్తగా మార్చేందుకు సెక్టార్ అధికారులు చర్యలు చేపట్టనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీస్ బలగాలను ఏర్పాటు చేసి అధికారులు భద్రత చర్యలు చేపట్టారు.

నక్సల్స్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన చర్యలు

ఏటూరునాగారం మండలంలోని కొండాయి ఐలాపూర్, మల్యాల, కొత్తూరు, సర్వాయి, తుపాకులగూడెం, బాలాజీ బంధంలతో పాటు కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల, కన్నాయిగూడెం, ముప్పనపల్లి, ఏటూరు, సింగారం గ్రామాల్లో కూడా పోలీస్ బలగాలు పెద్ద ఎత్తున మోహరించి భారీ భద్రత చర్యలు చేపట్టారు. ఇప్పటి నుంచే అనుమానిత వ్యక్తుల్ని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు. ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పోలింగ్ అధికారులు తెలిపారు.

పోలింగ్ సామగ్రి తరలింపు

ఎస్ఎస్ తాడ్వాయి : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అత్యంత మారుమూల అటవీ ప్రాంతమైన లింగాల, బంధాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రిని పోలీస్ భారీ బందోబస్తు మధ్య ఆదివారం తరలించారు. సోమవారం జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక అటవీ ప్రాంతంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరుపున పకడ్బందీ చర్యలు చేపట్టారు. బంధాల, లింగాల జీపీల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు అధికారులు ఎన్నికల సామగ్రిని పోలీస్ బందోబస్తు మధ్య తరలించారు. ఆదివారం నుంచి సమస్యాత్మక ప్రాంతంలోని పోలింగ్ కేంద్రాల వద్ద స్పెషల్ పార్టీ పోలీసులు పహారా కాస్తున్నారు. జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిలు మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. కాగా ఆదివారం సాయంత్రం నుంచి మండలంలో భారీగా గాలి దుమారం రావడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో పోలింగ్ సామగ్రిని తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు. గాలి దుమారంతో కరెంట్ సమస్య కొనసాగితే పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి ఇబ్బందులు తప్పేలా లేవు.

గోవిందరావుపేట: లోకసభ ఎన్నికల సందర్భంగా సోమవారం జరిగే పోలింగ్‌కు యంత్రాంగం భద్రత కట్టుదిట్టం చేసింది. ఆదివారం సిబ్బంది నిర్దేశిత కేంద్రాలకు చేరుకొని పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్‌లను సిబ్బంది ఈవీఎంలను వెంట తీసుకొచ్చారు. మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించారు.



తాడ్వాయి : పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో వస్తున్న అధికారులు



గోవిందరావుపేట: పస్రాలోని మోడల్ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

కన్నాయిగూడెం: మండలంలోని 11 పంచాయతీల్లోని 14 పోలింగ్ కేంద్రాల వద్ద జిల్లా అధికారుల ఆదేశాల మేరకు భారీ భద్రత ఏర్పాట్లు చేసినట్లు స్థానిక ఎస్సై సురేష్ తెలిపారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురి కంటే ఎక్కువ ఒకేచోట ఉండరాదని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు మండల ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

వెంకటాపురం(కె): మండలంలోని 18 పంచాయతీల్లోని 32 పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం వరకు ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం డివిజన్ కేంద్రం నుంచి ఎన్నికల సామగ్రితో బయలుదేరిన ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్‌కేంద్రాలకు సామగ్రితో చేరుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది బస్సుల్లో చేరుకున్నారు.

వాజేడు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని 27 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. ములుగు జిల్లా కేంద్రం నుంచి ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన బస్సుల్లో ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని రూట్ అధికారులు తరలించారు. సోమవారం ఉదయం7 గంటల నుంచి సాయంత్రం4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. మండలంలోని 27 పోలింగ్ కేంద్రాల్లో 19,002 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



ఏటూరునాగారం: పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర సీఆర్‌పీఎఫ్ పహారా



ఏటూరునాగారం: పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలతో వస్తున్న సిబ్బంది

మోడల్ పోలింగ్ కేంద్రం అదరహో!



పస్రాలో మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద స్వాగతతోరణం ఏర్పాటు చేసిన అధికారులు

గోవిందరావుపేట : మండల పరిధిలోని పస్రా ఉన్నత పాఠశాల ఆవరణలో మోడల్ పోలింగ్ కేంద్రం అదరహో అనిపిస్తుంది. పోలింగ్ కేంద్రంలోకి అడుగుపెట్టే ముందు ఆశ్చర్యానికి గురి కావాల్సిందే. పోలింగ్ కేంద్రాన్ని అధికారులు పెళ్లి మండపంలా ముస్తాబ్ చేశారు. ప్రతి మండలంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనేది ఎన్నికల సంఘం ఉద్దేశం. ఇందులో భాగంగానే మండల పరిధిలోని పస్రా నాగారం హైస్కూల్‌లో 71–109 పోలింగ్ కేంద్రాన్ని మోడల్ కేంద్రాంగా తీర్చిదిద్దారు. పూలతో అలకరించి, అరటి బొత్తలు, మామిడి ఆకులతో స్వాగతతోరణాలు కట్టారు. పూల కుండీలతో కార్పెట్లు పరిచి ఓటర్లకు స్వాగతం పలుకుతూ కేంద్రాన్ని అందంగా అలంకరించారు. పోలింగ్ లోపల కూడా పెళ్లి మండపం లా తీర్చిదిద్దారు. ఓటర్ల దాహం తీర్చడం కోసం చలువ పందిర్లతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వీటన్నింటి మధ్య ఓటరు ఒక కొత్త అనుభూతి పొందనున్నాడు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

శాయంపేట : మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి, శివమార్కండేయ ఆలయంలో శ్రీ ఏకాదశ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం మూడో రోజు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భద్రకాళి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి, శ్రీ పర్వత వర్ధని సమేత శివమార్కండేయ స్వామి, శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, పంచముఖ ఆంజనేయస్వామి, నాగదేవత విగ్రహాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూలమంత్ర హవనం, హోమాలు నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, పర్వత వర్ధని సమేత శివ మార్కండేయ స్వామి కల్యాణ మహోత్సవాలను వేద మంత్రోచ్ఛరణాల మధ్య అంగరంగ వైభవంగా చేపట్టారు. అనంతరం హైకోర్టు న్యాయవాది మామిడి రూపేందర్ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాష్, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్, తాటి రమేష్, చిందం కర్ణాకర్, గ్రామస్తులు వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, సదాశివుడు, చంద్రమౌళి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న హెడ్ నర్సు నీరజరాణి

చిట్యాల: మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీ, హెడ్‌నర్సు నీరజరాణి, స్టాఫ్ నర్సులు స్వప్న, అనిత, కవిత, శ్వేత, సంధ్య, సునీత, ఏఎన్ఎంలు మీనాక్షి, కోమలాదేవి, ఆస్పత్రి సిబ్బంది మహేందర్, చంద్రశేఖర్, పుల్ల సతీష్‌కుమార్, రాయిని శ్రీకాంత్, ఉప్పుల కిరణ్, రాజేందర్, వనిత, రాధ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిక్షణకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న రాజయ్య

మొగుళ్లపల్లి: హైదరాబాద్‌లో ఈ నెల 14 నుంచి 25 వరకు జరిగే జాతీయ సమైక్యతా శిక్షణ శిబిరానికి మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు ఎల్.కుమారస్వామి, ఏఎన్ఓ గుండెల్లి రాజయ్య తెలిపారు. శిబిరానికి 9వ తరగతి విద్యార్థులు టి.రాజ్‌కుమార్, ఆర్. వినయ్, టి.బన్నీ, 8వ తరగతి విద్యార్థులు ఎస్. యాకయ్య, ఎం.స్టేయిన్ దినకరన్, ఎస్.రాకేష్ ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఆవరణలో ఎన్‌సీసీ అధికారి రాజయ్య పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

కారు చీకట్లో సిబ్బంది విధులు



చెట్లను తొలగిస్తున్న ఎస్సై మహేందర్‌కుమార్

మహాముత్తారం: అకాల వర్షంతో మండలంలోని కనుకునూర్, పెగడపల్లి తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో చెట్లు విరిగిపడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆయా గ్రామాలకు వెళ్లిన ఎన్నికల సిబ్బంది కొవ్వొతులతో విధులు నిర్వహిస్తున్నారు. కనుకునూర్ ప్రధాన రహదారిలో విరిగిపడ్డ చెట్ల కొమ్మలను ఎస్సై మహేందర్‌కుమార్ తన సిబ్బంది తొలగించారు.



కాళేశ్వరం : మద్దులపల్లి పోలింగ్ కేంద్రంలో సెల్‌ఫోన్ లైట్లతో ఏర్పాట్లు చేసుకుంటున్న సిబ్బంది



కాళేశ్వరం ప్రాథమిక పాఠశాల బూత్ సెల్‌ఫోన్స్ లైట్ల వెలుతురులో అధికారులు

భూపాలపల్లిలో జోరుగా వర్షం



భూపాలపల్లిలో కురుస్తున్న వర్షం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలో ఆదివారం రాత్రి జోరుగా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కరుస్తున్న వర్షానికి వరదలు పారాయి. వాతావారణం ఒక్కసారిగా చల్లబడింది. కాని భూపాలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. నాగారం కొనుగోలు కేంద్రంలో మూడు రోజుల క్రితం కురిసిన వానకు ధాన్యం కొట్టుకుపోగా ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం మళ్లి తడిసి ముద్దయిందని రైతు కేశబోయిన అనిల్ ఆవేదన వ్యక్తం చేశాడు. అదేవిధంగా సుమారుగా రెండు గంటలపాటు పట్టణంలో పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పట్టణంలోని పోలింగ్ కేంద్రాలకు వచ్చిన అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడిన పరిస్థితి నెలకొంది.

27 పోలింగ్ కేంద్రాలు

మహాముత్తారం: మండలంలోని 24 గ్రామ పంచాయతీలను నాలుగు సెక్టార్లుగా విభజించి 27 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో 137 మంది సిబ్బందిని నియమించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం విధుల్లో చేరారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

నడికూడ : మండలంలో ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండలవ్యాప్తంగా మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానిక రైతు వరిధాన్యంపై టార్పాలిన్ కప్పే క్రమంలో ఆకస్మికంగా ఈదురు గాలులు రావడంతో కింద పడ్డాడు. దీంతో అతని చేతికి గాయమైంది. స్థానికులు వైద్య చికిత్స కోసం పరకాలకు తరలించారు. కాగా పలు గ్రామాల్లో ఎన్నికల సిబ్బంది విద్యుత్ సరఫరా లేక, సెల్‌ఫోన్ వెలుతురులో ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు.

జగదాచార్య జయంతి

నర్సంపేట : పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జగదాచార్య శ్రీరామానుజా తిరునక్షత్ర సందర్భంగా జగదాచార్య 1007వ జయంతిని వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి కోఆర్డినేటర్ దాస్యం రంగనాథస్వామి మాట్లాడారు. చెన్నయ్‌లోని శ్రీరంగంలో ఆలయ గోపురం 237 అడుగులు ఉండగా తెలంగాణలోని హైదరాబాద్ ముచ్చింతల్ శ్రీరామనగర్‌లో శ్రీరామానుజుల విగ్రహం 216 అడుగులోతు ఉందని చెప్పారు. భూలోక వైకుంఠముగా భక్తులకు దర్శనమిస్తున్నారని తెలిపారు. తొలుత అర్చకులు ముడుంబై రామాచార్య విశ్వక్సేన, పుజాధికాల అనంతరం భక్తుల చేత భాగవత్ రామానుజ అష్టోత్తర శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము, పారాయణం చేయించారు. వికాస తరంగిణి అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ శ్రీరామనగర్‌లోని ఆలయాన్ని ప్రజలందరూ దర్శించుకోవాలని సూచించారు.

డీటీడీఓను సస్పెండ్ చేయాలి

నర్సంపేట : గిరిజన సంక్షేమ శాఖను మూడేళ్లుగా భ్రష్టుపట్టిస్తున్నాడంటూ హనుమకొండ, జనగామ డీటీడీఓ ప్రేమకళను సస్పెండ్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో పని చేస్తున్న వార్డెన్లు, వర్కర్స్, కాంటిజెన్స్ ఉద్యోగులను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టడంతోపాటు చిన్నపాటి తప్పులను సాకుగా చూపించి సస్పెండ్ చేసి తిరిగి లక్షలాది రూపాయలు దండుకుని ఉద్యోగంలో తీసుకుంటున్నారని తెలిపారు. ఒక్కో వార్డెన్‌కు రెండేసి స్థానాలు చొప్పున అప్పగిస్తూ డైట్ బిల్లుల నుంచి 20 శాతం చొప్పున డబ్బు వసూలు చేస్తూ అక్రమంగా కోట్లకు పడగలెత్తుతున్నాడని చెప్పారు. డీటీడీఓ ప్రేమకళ సంపాదించిన ఆస్తులపై ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారి సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని, కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. డీటీడీఓను సస్పెండ్ చేయకపోతే ఆందోళనలు చేపడతామని తెలిపారు.

క్షుద్ర పూజల కలకలం

నడికూడ : మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు మూఢనమ్మకాలపై పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ జనాల్లో మార్పు రావడం లేదు. మండలంలోని రామకృష్ణపూర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం క్షుద్ర పూజలు చేసి, జంతుబలి ఇవ్వడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు, కూలీలు భయంతో వణికిపోతున్నట్లు తెలిపారు. కాగా గతంలో కూడా కూడలి వద్ద, అమావాస్య రోజు తరుచుగా గ్రామాల్లో క్షుద్ర పూజలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా క్షుద్ర పూజలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.